సాక్షి
చిత్తూరు
ఆదివారం । 4 । జూన్ । 2023



మోసంలో టీడీపీదే అగ్రస్థానం
ప్రజలను మోసం చేయడంలో టీడీపీ ముందుం టుందని వైఎస్సార్‌సీపీ మీడియా కోఆర్డినేటర్ సజ్జల భార్గవ్ ఆరోపించారు. - 13లో



క్రికెట్ విజేత కృష్ణా జట్టు
నగరి కేవీకే మైదానంలో రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీల్లో కృష్ణా జట్టు విజేతగా నిలిచింది. - 10లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	40	27
తిరుపతి	36	24
తిరుమల	36	24
గూడూరు	42	31
నగరి	42	29

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ సెంటర్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒడిశా రైలు ఘటనలో ప్రయాణికుల సమాచార నిమిత్తం కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ షణ్మో హన్ వెల్లడించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒడిశాలో రైలు ప్రమాద ఘటనలో జిల్లాకు చెందిన ప్రయాణికులున్నట్లైతే 9491077356, 08572–242777 నెంబర్లను సంప్రదించి సమాచారం తెలియజేయాలని పేర్కొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈగా ఉమామహేశ్వరరెడ్డి



నూతన ఎస్‌ఈ ఉమామహేశ్వరరెడ్డిని సత్కరిస్తున్న బదిలీ అయిన ఎస్‌ఈ దేవానందం

చిత్తూరు కార్పొరేషన్: ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈగా ఉమామహేశ్వరరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఈ దేవానందం ఒంగోలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ సీఈ కార్యాలయ ఎస్‌ఈగా ఉన్న ఉమామహేశ్వరరెడ్డి ఇక్కడికి వచ్చారు. ఆయనను దేవానందం మర్యాద పూర్వకంగా సన్మానించి బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఈఈ స్టాన్లీజోన్స్, డీఈ దస్తగిరి, అధికార, అనధికారులు కలిసి స్వాగతం పలికారు.

పంటలపై గజరాజుల బీభత్సం



ఏనుగులు విరిచేసిన కొబ్బరిచెట్టు

పెద్దపంజాణి: పెద్దపంజాణి మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. పెద్దకాప్పల్లి అటవీ ప్రాంత సరిహద్దు గ్రామాలైన పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లి, కొత్తబూరగపల్లె, పెద్దకాప్పల్లె, ముదిరెడ్డిపల్లె, జిట్టంవారిపల్లె పొలాల్లోకి ఏనుగుల గుంపు పదేపదే చొరబడుతూ పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. శుక్రవారం రాత్రి పేటూరు బీటు నుంచి వచ్చిన మూడు ఏనుగులు పెనుబలకల గ్రామానికి చెందిన శ్రీరాములు వరి పంటపై విరుచుకుపడి తీవ్రంగా నష్టం చేకూర్చాయి. అదే గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, మునస్వామి మామిడి తోటలపై దాడి చేశాయి. మామిడి కాయలను సగం తిని, సగం తొక్కి నాశనం చేశాయి. రైతు శేఖర్ టమాట పంటను ధ్వంసం చేశాయి. ఈశ్వరమ్మకు చెందిన కొబ్బరి చెట్లను విరిచేశాయి. శనివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటలు ధ్వంసమై ఉండడం చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఈ దాడుల్లో సుమారు రూ.లక్ష మేరకు నష్టం జరిగినట్లు అంచనా. చేతికొచ్చిన పంట ఏనుగుల దాడుల్లో నష్ట పోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులు పంటలపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చిలుకా క్షేమమా!



రామచిలుకకు నీరు తాగిస్తున్న ఎస్‌ఐ సుబ్బారెడ్డి

పలమనేరు: కరెంట్ షాక్‌తో కిందపడిన రెండు రామచిలుకలను పలమనేరు పోలీసులు శనివారం రక్షించారు. విధి నిర్వహణలో భాగంగా ఎస్‌ఐ సుబ్బారెడ్డి, సిబ్బంది జల్లిపేట వద్ద జీపులో వెళుతుండగా రెండు రామచిలుకలు కరెంట్ షాక్‌కు గురై పడి ఉన్నాయి. వెంటనే జీపు ఆపి వాటిని తీసుకుని పట్టణంలోని వెటర్నరీ ఆస్పత్రిలో వైద్యం చేయించి గాలిలోకి వదలగా, రివ్వుమంటూ అవి ఎగిరిపోయాయి.

కన్నీటియాత్ర

కల్లూరు-పీలేరు జాతీయ రహదారి రక్తసిక్తమైంది. శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. మరో నలుగురు తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలయ్యారు. వీరంతా నంద్యాలకు చెందిన వారు. నంద్యాల నుంచి తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు వెళుతుండగా అనుకోని ప్రమాదం చోటుచేసుకుంది. అదేవిధంగా తమిళనాడులోని పోలూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లావాసులు ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. వీరిలో ఒక మహిళ పలమనేరుకు చెందిన ప్రైవేటు స్కూల్‌లో టీచర్. మరో వ్యక్తి ఐరాలకు చెందిన కారు డ్రైవర్. వీరు కూడా తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు వెళుతుండగానే ప్రమాదం చోటుచేసుకుంది.



■ 'మా అమ్మ అరుణాచలం గుడికెళ్తొస్తానంటే సంతోష పడ్డాను. వెళ్లిరమ్మని ఆనందంగా సాగనంపాను. ఇంతలో ఆ దేవుడు మా అమ్మను తీసుకెళ్లాడు..! ఇక నాకు దిక్కెవరు అమ్మా..' అంటూ మృతురాలు విమలమ్మ కుమారుడు లోకేష్ రోదనలు చూపరులను కలిచివేశాయి.



■ 'కాలనీ వాసులతో కలిసి కుటుంబ సమేతంగా అరుణాచలం గుడికి వెళ్లొస్తానన్నాడు. కొన్ని గంటలు తిరగకముందే మృతిచెంది హాస్పిటల్‌లో ఉన్నాడని ఫోన్ చేశారు. మొదట నమ్మలేకపోయాను. ఇంత ఘోరం జరుగుతుందనుకోలేదు. రోజూ కలిసిమెలసి ఉండేవాళ్లం. జీవితంలో మంచి స్నేహితుడ్ని కోల్పోయాను. ఆ దేవుడు తీరని దుఃఖాన్ని మిగిల్చాడు' అంటూ మృతుడు ప్రతాప్‌రెడ్డి స్నేహితుడు కార్తీక్ కన్నీటి పర్యంతమవడం అక్కడి వారి గుండెలను బరువెక్కించింది.



■ 'అత్తమ్మ చాలా మంచిది.. రోజూ పలకరించేవాడ్ని. దైవదర్శనం చేసుకుని క్షేమంగా వస్తుందనుకుంటే ఇలా రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడుతుందని ఊహించలేకపోయాను. చాలా బాధేస్తోంది.. అత్తమ్మ లేని లోటు తీర్చలేనిది. ఆమె మృతి నా జీవితానికి తీరనిలోటు' అని మృతురాలు విమలమ్మ మేనల్లుడు ప్రతాప్ బోరున విలపించడం చూసి ఆస్పత్రి వద్ద ఉన్న రోగుల కళ్లలో నీళ్లు సుడులు తిరిగాయి.

- తిరువణ్ణామలై వెళ్తూ దుర్ఘటనలు
- కల్లూరు– పీలేరు జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం
- లారీని వెనుక నుంచి ఢీకొట్టిన తుపాన్ వాహనం
- నలుగురు నంద్యాల వాసులు మృతి
- తమిళనాడులోని పోలూరు వద్ద మరో ప్రమాదం
- కారును ఢీకొన్న తమిళనాడు ఆర్టీసీ బస్సు
- ఇద్దరు జిల్లా వాసుల దుర్మరణం



కల్లూరు సమీపంలో లారీ కిందకు దూసుకెళ్లిన తుఫాన్ వాహనం

సాక్షి, చిత్తూరు/పులిచెర్ల (కల్లూరు)/నంద్యాల: వారంతా ఎక్కడెక్కడి నుంచో కొన్నేళ్ల క్రితం ఉద్యోగ, వ్యాపారాల కోసం నంద్యాలకు చేరుకున్నారు. అపార్ట్‌మెంట్ వేదికగా వారి మధ్య స్నేహబంధం ఏర్పడింది. పండుగలు, వేడుకలు సంతోషంగా నిర్వహించుకునేవారు. అప్పుడప్పుడూ విహార, తీర్థయాత్రలకు వెళ్లేవారు. ఈసారి అలా వెళ్లిన వారిలో నలుగురు తిరిగి రాలేదు. మృత్యువు పొట్టన పెట్టుకుంది. వారి తీర్థయాత్ర విషాదయాత్రగా మిగిలింది. అరుణాచలం దైవదైర్శనానికి వెళుతూ కల్లూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణం ఎస్‌బీఐ కాలనీకి చెందిన శివమ్మ(44), ఎన్‌జీఓస్ కాలనీకి చెందిన విమలమ్మ(45), లక్ష్మీదేవి(55), నర్స్ క్వార్టర్స్‌కు చెందిన ప్రతాపరెడ్డి(43) మృతి చెందారు. సెబ్ సీఐ నాగమణితో పాటు మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

ఉద్యోగ, వ్యాపార రీత్యా వచ్చి..

మృతులంతా ఉద్యోగ, వ్యాపార రీత్యా కొన్నేళ్ల క్రితం నంద్యాలకు వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఎన్‌జీఓ కాలనీలో ఉన్న సింఫని అపార్టుమెంట్‌లో ప్రస్తుతం సెబ్ సీఐగా పని చేస్తున్న నాగమణి, విమలమ్మ, లక్ష్మీదేవి, శివమ్మ నివాసం ఉండేవారు. ఈ స్నేహం వీరు ఇల్లు మారినా కొనసాగింది. ఏ శుభకార్యం జరిగినా, తీర్థయాత్రలకు వెళ్లాలన్నా వీరంతా కలిసి వెళ్లేవారు. మహిళలందరూ గృహిణులే. భర్తలు ఉద్యోగాలు, వ్యాపారాలు చేసేవారు. మృతురాలు శివమ్మ గృహిణి కాగా భర్త శివస్వాములు శిరివెళ్ల పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. వీరు ప్రస్తుతం ఎస్‌బీఐ కాలనీలో నివసిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నారు. మృతురాలు విమల గృహిణి కాగా, భర్త నాగన్న నంద్యాలలో విద్యుత్ కార్యాలయంలో ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. వీరికి కొడుకు, కూతురు ఉన్నారు. మృతురాలు లక్ష్మీదేవి గృహిణి కాగా భర్త రామ్మోహన్ వ్యాపారం చేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు ప్రతాపరెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండగా భార్య స్వాతి గృహిణి. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రజలు ప్రమాద విషయం తెలుసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. కొన్ని సంవత్సరాల పాటు ఇక్కడే అందరితో కలివిడిగా తిరిగిన మనుషులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ ప్రాంత వాసులు జీర్ణించుకోలేకపోయారు.

అతికష్టం మీద మృతదేహాల వెలికితీత

తుపాన్ వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలను అతికష్టం మీద బయటకు తీయాల్సి వచ్చింది. అతివేగం కారణంగా జీపు లారీకి వెనుక దూసుకుపోయింది. దీంతో మృతదేహాలను వెలికి తీసేందుకు పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మధ్యాహ్నానికి బాధితుల కుటుంబీకులు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. దైవదర్శనానికి వెళ్లి వస్తామని చెప్పిమృత్యుఒడికి చేరారని బోరున విలపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించా రు. గాయపడిన వారిని తొలుత పీలేరు ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి రుయాకు తరలించారు.

నిశీధిలో హాహాకారాలు

మొదలే రాత్రి.. సుదీర్ఘ ప్రయాణంతో అలసిసొలసిన ప్రయాణికులు నిద్రలోకి జారుకున్నారు. అంతలోనే జరిగిన ప్రమాదంతో ఏం జరుగుతోందో.. ఎవరికి గాయాలయ్యాయో.. ఎవరు మృతి చెందారో తెలుసుకోలేక పోయారు. కళ్లెదుటే రక్త గాయాలతో మృత్యుఒడికి చేరుకుంటున్న బంధువులను చూసి దుఃఖసాగరంలో మునిగిపోయారు. హాహాకారాలు మిన్నంటించారు.

జిల్లావాసులు ఇద్దరు దుర్మరణం

పలమనేరు: తిరువణ్ణామలై గిరిప్రదక్షిణకు కారులో వెళుతుండగా తమిళనాడులోని పోలూరు వద్ద ఎదురుగా బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ఇద్దరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో ఓ మహిళ పలమనేరు వాసి. పట్టణానికి చెందిన గిరిధర్ భార్య లక్ష్మి(45) స్థానికంగా ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. గిరిప్రదక్షిణ కోసం చిత్తూరులోని తమ బంధువైన ఏఆర్ మురళీకృష్ణ భార్య రాణిసరోజా(46)తో కలసి ఐరాలకు చెందిన డ్రైవర్ బాబు(45)తో కారులో శనివారం చిత్తూరు నుంచి బయలుదేరారు. పోలూరు పరిధిలో వీరి కారును తమిళనాడు ఆర్టీసీ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ బాబుతో పాటు పలమనేరుకు చెందిన లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందారు. చిత్తూరుకు చెందిన రాణిసరోజా పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఆమెను ఆస్పత్రికి తరలించారు.



కారులోనే మృతి చెందిన ఐరాలకు డ్రైవర్ బాబు, పలమనేరుకు చెందిన లక్ష్మి



తీవ్రంగా గాయపడిన చిత్తూరుకు చెందిన రాణి సరోజ

కల్పవృక్షంపై రాజమన్నార్‌గా కటాక్షం



కల్పవృక్ష వాహనంపై దర్శనమిస్తున్న రాజమన్నార్



సర్వభూపాల వాహనంపై శ్రీనివాసుడు

వడమాలపేట : అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం ఉదయం స్వామివారు శ్రీరాజమన్నార్ అలంకరణలో కల్ప వృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశ్వరూప దర్శనం, శుద్ధి, కొలువు, తోమాలసేవ, అర్చన, మొదటిగంట తదితర నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. శ్రీవారిని వాహన మండపంలోకి వేంచేపు చేసి సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి స్వామివారి ఉత్సవమూర్తిని పట్టు పీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు మాడ వీధుల్లో మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ కల్పవృక్ష వాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 7 వరకు ప్రతి నెల నిర్వహించే ఆర్జిత కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సర్వభూపాల వాహనంపై శ్రీనివాసుడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి ముత్యపు పందిరి వాహనంపై స్వామివారు ఊరేగితూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, టెంపుల్ సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఆలయ అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ఫలితాలు విడుదల అయినట్లు డీఈవో విజయేంద్రరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పరీక్షల ఫలితాలను www. bse.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులు త్వరలో డీఈవో కార్యాలయానికి వస్తాయని తెలిపారు. జాతీయ విద్యామంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ వారి నియమాల ప్రకారం తదుపరి కసరత్తు ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులు ఏదైన జాతీయ బ్యాంక్‌లో వ్యక్తిగత సేవింగ్స్ అకౌంట్‌ను ఓపెన్ చేసుకోవాలని తెలిపారు. తండ్రి, తల్లితో జాయింట్ ఖాతాగా ఉండాలని చెప్పారు. విద్యార్థి ఆధార్ నంబరును మాత్రమే అకౌంట్ కు జతచేయాలన్నారు.విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, మెరిట్ కార్డులో ఉన్న విధంగానే ఆధార్ కార్డులో, బ్యాంకు పాస్‌పుస్తకంలో ఉండేలని డీఈవో సూచించారు.

విహరిస్తూ..అలరిస్తూ!



తిరుచానూరు: తిరుచానూరులో శనివారం తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది. తెప్పపై విహరిస్తున్న అమ్మవారిని దర్శించి అశేష భక్తులు తరించారు.

ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : తహసీల్దార్లు, సర్వే టీమ్‌లు ప్రణాళిక ప్రకారంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు. శనివారం క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జూలై నెలాఖరులోగా రీసర్వే లో గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పెండింగ్ ఉన్న మండలాల్లో ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. సరిహద్దు రాళ్ల నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాల న్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని తెలిపారు. టార్గెట్ ను తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. రీ సర్వే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు.

- ఎంఈఓపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం
- పలు పాఠశాలలను తనిఖీ చేసిన సెక్రటరీ

పుస్తకాలను ఎందుకు వెనక్కు తీసుకున్నారు?



గంగవరం: జిల్లా కలెక్టర్‌తో కలిసి విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

గంగవరం: మండలంలోని మేలుమాయి జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న కిట్లలోని పాత పాఠ్య పుస్తకాలను చూసి పాఠశాలల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌తో కలిసి గంగవరం మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. గంగవరం జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత మేలుమాయి జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేసి నాడు–నేడు పనులు, జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. తనిఖీలో గత ఏడాది పంపిణీ చేసిన జగనన్న కిట్లలోని పాఠ్య పుస్తకాలు ఉండడంపై అసహనం వ్యక్తం చేస్తూ సీరియస్ అయ్యారు. ఒకసారి విద్యార్థులకు ఇచ్చిన జగనన్న విద్యాకానుక కిట్లలో పాఠ్య పుస్తకాలను విద్యార్థుల నుంచి తిరిగి వెనక్కు ఎందుకు తీసుకున్నారు.. వాటిని మీరేమన్నా అమ్ముకోదలిచారా.. బాధ్యతలు పూర్తిగా విస్మరిస్తున్నారు.. పాఠశాల తనిఖీకి తాను వస్తున్నానని పిల్లలను ఎందుకు పిలిపించారు.. అంటూ ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీధర్‌పై మండిపడ్డారు. విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. తరువాత జగనన్న విద్యాకానుక కిట్లలో పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు తదితరాలను పరిశీలించారు.

సీఆర్‌పీలకు సీరియస్ వార్నింగ్

పలమనేరు: ప్రభుత్వ పాఠశాలలపై ఎలాంటి ఆరోపణలు వచ్చినా మీ నిర్లక్ష్యంగా పరిగణిస్తామని సీఆర్‌పీలకు ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ క్లాస్ ఇచ్చారు. పలమనేరు బోయవీధి స్కూల్‌లో జరుగుతున్న నాడు–నేడు పనులను ఆయన శనివారం తనిఖీ చేశారు. అదే పాఠశాలకు చెందిన విద్యార్థుల ఇళ్ల వద్దకెళ్లి హోంవర్క్, ప్రోగ్రెస్ కార్డులందాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం బాలుర హైస్కూల్‌లోని జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది సీఆర్పీలు విధులను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సీఆర్పీలు పాఠాలు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డి, డీఈవో విజయేంద్రరావు పాల్గొన్నారు.

చోరీ అయిన నగలు మిద్దెపైన ప్రత్యక్షం

- ఇది రాజనాల బండ మహిమేనన్న బాధితుడు
- నగలతో వెళ్లి ఆలయంలో పూజలు


పూజల అనంతరం నగలను తీసుకుంటున్న బాధితుడు వెంకటరమణ

చౌడేపల్లె: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ శ్రీవీరాంజనేయ స్వామి మహిమతో చోరీ అయిన బంగారు నగలు మళ్లీ లభ్యమైనట్లు బాధితుడు, పుంగనూరు పట్టణం మేలుపట్లకు చెందిన వెంకటరమణ తెలిపారు. శనివారం రాజనాల బండలో అర్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో లభ్యమైన నగలను స్వామివారి పాదాల చెంత పెట్టి పూజ చేసి తీసుకొన్నారు. ఆయన కథనం మేరకు. వెంకటరమణ ఇంట్లో గత నెల 23వ తేదీ సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే బంగారు నగలు చోరీ అయ్యాయి. తనకు అనుమానం ఉన్న వారితో ప్రమాణాలకు రాజనాలబండకు వెళ్లాలని తీర్మానించారు. శనివారం అందరూ ప్రమాణాలకు బయలు దేరాల్సి ఉండగా.. ఇంటి మిద్దెపై మూట కనిపించింది. మూట విప్పి చూడగా చోరీకి గురైన బంగారు నగలు ప్రత్యక్షమయ్యాయి. శ్రీవీరాంజనేయస్వామి మహిమగా భావించి ఈ నగలను తీసుకుని వెంకటరమణ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు.

పెద్దిరెడ్డి పేరెత్తే అర్హత చీటర్ యాదవ్‌కు లేదు

- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం
- దమ్ముంటే బహిరంగ విచారణకు రా..
- ఎంపీ రెడ్డెప్ప సవాల్


మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప, పక్కన కొండవీటి నాగభూషణం

పుంగనూరు: 'గత ఎన్నికల్లో రూ.2000 టోకెన్లు ఇచ్చి, ప్రజలను మోసగించావ్..వివిధ రాష్ట్రాల్లో మోసాలు చేసి16 కేసుల్లో ఇరుక్కున్నావు. నువ్వెంత..నీబతుకెంత, దమ్ము ధైర్యం ఉంటే పుంగనూరులో నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రా.. అక్రమార్జన చేసే నీకు మంత్రి పెద్దిరెడ్డిని, ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదు. ప్రజలు ఈ విషయాలను గమనించాలి' అని రామచంద్రయాదవ్‌పై చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కి సాని భాస్కర్‌రెడ్డితో కలసి ఎంపీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ లోక్ సభ ప్యానల్ స్పీకర్ మిథున్‌రెడ్డి ప్రాజెక్టుల నిర్మాణ బాధ్యతలను చంద్రబాబుకు అప్పగిస్తామని, ఆయనే పూర్తి చేయవచ్చని ఇటీవల పిలుపునిచ్చారని, కానీ ఏపార్టీకి చెందని, అర్హతలేని పెద్దపంజాణి మండలం పాసార్లపల్లెకు చెందిన బచ్చా రామచంద్రయాదవ్ హంద్రీనీవా కాలువ నాకు ఇప్పించండి, మిథున్‌రెడ్డి సవాల్‌ను అంగీకరిస్తున్నామంటు మాట్లాడడం అవగాహన రాహిత్యమన్నారు. అవగాహన లేకుండా మాట్లాడి సోషియల్ మీడియాలో నాయకుడు కావాలనుకుని పుంగనూరులో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. తొలినుంచి ప్రజలను మోసగించే వ్యక్తి యాదవ్ అని, అతను చీటింగ్‌లలో సిద్ధహస్తుడనే విషయం చాలామందికి తెలుసునని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని, మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే తగిన గుణపాఠం నేర్పుతామని హెచ్చరించారు. కొండవీటి నాగభూషణం మాట్లాడుతూ మంత్రి ప్రాజెక్టుల పేరుతో స్వలాభం చేసుకుంటున్నారని ఆరోపణలు రుజువు చేయగలవా..అంటు ప్రశ్నించారు. తల్లిదండ్రులకు తిండిపెట్టని యాదవ్ ప్రజలకు ఏమి సేవ చేస్తాడో ప్రజలు గమనించాలన్నారు. మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం పేరు ఎత్తితే సహించేది లేదని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రారెడ్డి యాదవ్, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌గా గెలవగలవా...

కౌన్సిలర్‌గా కూడా గెలవలేని యాదవ్ మంత్రి కుటుంబాన్ని విమర్శిస్తే చూస్తు ఊరుకోమని పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ చీటింగ్‌లతో లీడర్లు కాలేరని, అభివృద్ధి చేయాలని, ప్రజల్లో పేరు సంపాదించుకుని రాజకీయాలు చేయాలని హితవు పలికారు. మంత్రి కుటుంబాన్ని విమర్శిస్తే పేరు రావడం పక్కన పెడితే పతనం మాత్రం తప్పదన్నారు. కులాలను అడ్డుపెట్టుకుని సోషియల్ మీడియా వేదికగా చేసుకుని దూషణకు దిగితే ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతాని హెచ్చరించారు.

తండ్రిని చంపిన తనయుడు

- కూలి డబ్బులు కోసం తగాదా


సుబ్రమణ్యం మృతదేహం

రామకుప్పం: కూలీ డబ్బుల కోసం తలెత్తిన ఘర్షణలో తండ్రిని చంపిన సంఘటన రామకుప్పం మండలంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతకుప్పం గ్రామానికి చెందిన సుబ్రమణ్యం(45) అతని ఇద్దరు కుమారులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కూలి డబ్బుల విషయంగా తండ్రి, పెద్ద కుమారుడు(17) మధ్య శనివారం ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో సుబ్రమణ్యం తన కుమారునిపై చేయిచేసుకున్నాడు. ఆగ్రహించిన కుమారుడు పక్కనే ఉన్న చిన్నపాటి చెక్కతో తండ్రి తలపై కొట్టాడు. దీంతో అతను అక్కడే కూలిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు సుబ్రమణ్యంను చికిత్స కోసం రామకుప్పం పీహెచ్‌సీకి తరలించారు. అయితే అప్పటికే అతను మృతిచెందినట్లు పీహెచ్‌సీ సిబ్బంది నిర్ధారించారు. ఇదిలావుండగా సుబ్రమణ్యం కుమారుడు అప్పుడప్పుడు మతిస్థిమితం లేకుండా ప్రవర్తించేవాడని గ్రామస్తులు తెలిపారు. మృతుని భార్య సుదమ్మ ఫిర్యాదు మేరకు రామకుప్పం ఇన్‌చార్జ్ ఎస్‌ఐ లక్ష్మీకాంత్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

క్రికెట్ టోర్నమెంట్ విజేత కృష్ణా జట్టు

- సమ్మర్‌క్యాంప్‌లో శిక్షణ పొందినవారికి టోర్నమెంట్
- రోజా చారిటబుల్ ట్రస్టు నిర్వహణ


పోటీలో తలపడుతున్న క్రీడాకారులు(ఇన్‌సెట్) సెంచరీ కొట్టిన రోహిత్

నగరి : స్థానిక కేవీకే మైదానంలో సమ్మర్ క్యాంప్‌లో క్రికెట్‌లో శిక్షణ పొందిన అండర్ -14, అండర్ -16 క్రీడాకారులకు రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం శాప్ క్రికెట్ టోర్న మెంట్ పేరిట పోటీలు నిర్వహించారు. అండర్-14లో గోదావరి, కృష్ణా టీమ్‌ల మధ్య జరిగిన పోటీలో కృష్ణా టీం 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 30 ఓవర్ల నిర్ణీత మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి జట్టు 28.5 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ దిగిన కృష్ణా జట్టు 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. అండర్-16 విభాగంలో గంగా, యమున జట్ల మధ్య పోటీ నిర్వహించగా యమున జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 30 ఓవర్ల నిర్ణీత మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గంగా జట్టు 30 ఓవర్లలో అన్ని వికెట్లను కోల్పోయి 215 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ దిగిన యమున జట్టు 20 ఓవర్లలో లక్ష్యాన్ని చేధించింది. యమున జట్టులో రోహిత్ 65 బంతుల్లో సెంచరీ చేసి విజయంలో ప్రధాన పాత్ర వహించాడు. విజేతలైన జట్లకు బహుమతులు అందించినట్లు శాప్ కోచ్ బాబు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


సుబ్రమణ్యం(ఫైల్)

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలం టీఆర్ కండ్రిగ ఎస్టీ కాలనీలో శుక్రవారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై కూలీ మృతి చెందాడు. బాధితుల కథనం మేరకు... కాలనీకి చెందిన సుబ్రమణ్యం(45) ఇంట్లో ఫ్యా న్ స్విచ్ వేయగానే షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు కూలి పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు


బోల్తా పడిన కారు

చౌడేపల్లె: చౌడేపల్లె-సోమల మార్గంలోని సింగిరిగుంట సమీపంలో శనివారం కారు అదుపు తప్పి కారు బోల్తా పడింది. అతివేగంగా వస్తూ అదుపు తప్పి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో ముగ్గురు గాయపడినట్లు సమాచారం. కాగా వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.